# ఊహించని వేకువ

సౌభాగ్యం తీరిగ్గా కూర్చుని జీవితాన్ని నెమరువేసుకోవడం మరిచి రెండు పదులు ఉగాదులు దొర్లాయి. మళ్ళీ ఆ రోజు కాసులపేరు విడిపించటం. తండ్రి ఇప్పుడైనా భాగ్యం మెళ్లో పెట్టుకోనివ్వండర్రా అనటంతో ఇంట్లోవాళ్ళ విసురు మాటలు, బడాయిలు బయటపెట్టారు అక్కసు తీరేట్లు.

సౌభాగ్యం ముందుకు కాసుల పేరు గిరవాటెట్టిన చిన్న అప్ప ధనమ్మ, మొహం కందగడ్డలా చేసుకు అంతా బాగానే వున్నారు. మధ్య నింద అమాయకంగా వున్నందుకు మా ఆయన నెత్తిన రుద్దారు. ఏపాపం ఎరగనివాళ్ళని అన్నారు కనకే దాని కాపరం అల్లా ఏడ్చింది. అంటూ సౌభాగ్యాన్ని మరోసారి దెప్పింది.

పాపిష్టి సొమ్ములు పెట్టకపోయినా బాగుండేది. గుండెలమీద కుంపటిలా ఆడపిల్లని ఎల్ల కాలం భరించటంలో వుండే బాధ అనుభవిస్తేకాని తెల్సిరాదు. పగవాళ్ళకైనా వద్దు బాబూ ఈ నరకమంటూ తల్లి లెంపలేస్కుకోవటం చూసి సౌభాగ్యం మనస్సు దుఃఖ పడింది.

అదుగో అప్పుడే ఆ మొహంచూడు ఎల్లా పెట్టిందో అదే నాకు తట్టుకాలేసుకొస్తుంది ఏలుకోని అత్తార్ని చూసుకు మురుస్తూ ఇక్కడ రాజ్యమేలాలని కాబోలు దీని మనసు. అంటూ పెద్దక్క రాజమ్మ తల్లికిసాయపడినట్లు మాటకలిపింది.

సౌభాగ్యం కాసులపేరు చేతిలోకి తీసుకు కొంగుతో కంటికొలికలు వొత్తుకు ఓక్షణం నిల్చుని పెరట్లోంచి వంట వసారాలోకి వెళ్ళింది.

ఆ రోజు వంటచేసింది. వడ్డించింది. కాని మనస్సుపెట్టి ఏ పనీ చెయ్యలేకపోయింది.

ఐనా అన్నదమ్ములు వంటకాల్ని తెగ మెచ్చుకుంటూ తిళ్ళు పూర్తి చేశారు.

పక్కింటి రత్తమ్మగారు ఏమిటో హడావిడిగా మాటలు వినబడితే వచ్చానంటూ నడవాలో పీట వాల్చుకు కూర్చుని మాటలతో కలిసింది. నవ్వులతో నవ్వింది. సౌభాగ్యాన్ని చూసి జాలిపడింది. అది మరికొంచం ఎక్కువగా బైటపెట్టింది. సౌభాగ్యం తల్లి సుబద్రమ్మకి అది రుచించలేదు. మొహం చిట్లించింది. వహరికి చెప్పమంటే నేనూ చెబుతా సన్నాయి నొక్కులు నొక్కుకుంటూ అని దెప్పింది. మరి మీ పెద్దపిల్లకి ఆస్తిఅంతా పోయి అఘోరిస్తూంటే పట్టుమని పదిరోజులైనా పెట్టుకున్నావా అని నిలేసి అడిగింది.

మొదట రత్తమ్మ తెల్లబోయినా తేరుకుని కంఠాన్ని నిలబెట్టినట్టు ధాటీగానే జవాబు చెప్పింది. నా పిల్లతోటి పోల్చావా! సౌభాగ్యాన్ని హవ్వ నీ కూతుర్ని నీ యెదుట పొగడకూడదనుకో. సత్తెకాలంది.సీతమ్మవారంత ఓర్పుతో నీకూ నీ మిగిలిన సంతానానికి వళ్ళు విరుచుకు చేస్తోంది. దాని శక్తి అంతా ధారపోసింది. అయినకాడికి నీ పెద్దల్లుడు నగలెత్తుకెడితే వెనకేసుకొచ్చి సౌభాగ్యం కాపరం గంగపాలు చేశావు. దాని సొమ్ములు అవసరాలకి పెట్టుకు అక్కర్లు జరుపుకున్నది ఎవరు ఎరగరు కనక? దాని వళ్ళునిండా బంగారం చూడలేకేగా రాజమ్మ మొగుడికి ఆ బుద్ధి పుట్టింది! అప్పుడు ఎరగమా ఏమిటి?

మీ మేళ్ళల్లో చిన్నమెత్తు సొత్తు వక్కదాని దగ్గరా లేదు. ఇప్పుడంటే ఐశ్వర్యం వచ్చి గురివింజ గింజలా మిడిసి పడుతున్నారు - అంటూ పీటమీంచి విసురుగా లేచి గోడపైకి తూలి సర్దుకుని నా కూతురుకే నీ బిడ్డ బుద్ధివుంటే నాలుగిళ్ళూ ముప్పెత్తయినా పోషించేదాన్ని. వున్నన్నాళ్ళూ పెట్టాము. కాళ్ళు చాచుకున్నాక ఏం పెట్టగలం? అంటూ వెళ్ళిపోయింది.

రత్తమ్మ వెళ్ళాక అంతా తలోలాగా మాట్లాడారు. ఐనా దీన్ని అనాలి. వంటింటి కుందేల్లా ఆవిడ దగ్గర ఈవిడ బాధలు చెప్పుకు అఘోరిస్తుంది కాబోలు అంటూ సౌభాగ్యం మ్మీద విరుచుకు పడ్డారు అప్పలిద్దరూ.

సుభద్రమ్మ కంచంలో చెయ్యి కడుక్కుంటూ ఇంక చిన్నది పురిటికి వస్తుందాయె. దీని బుద్ధులు చూస్తే దానికి చిర్రెత్తుకువస్తుంది. ఇదేమన్నా నా కెందుకు అన్నట్లుంటుందా?

అతనితో కబుర్లు కాకరకాయలు మొదలెడుతుంది. ఆయనేవో కధలు గీకితే ఈవిడ పాండిత్యం వెలగబెట్టి తెగ మెచ్చుకోవటం, అదంతా నిజమనుకుని అర్ధరాత్రి అపరాత్రి అని కూడా తెల్సుకోకండా అతను దీన్ని వెతుక్కుంటూ వంటింట్లో మకాంపెట్టడం చూసేగా చిట్టికి ఆ ఫిట్సు పట్టు కుంటా. ఏదో పోయినసారి అల్లా అయింది. ఈసారి ఐనా తల్లీ పిల్లనీ పంపగలనో లేనో అని మనస్సు పరిపరివిధాల గుంజుతోంది. పోనీదీన్ని ఏ మేనత్త దగ్గరకైనా పంపుదామంటే వంట్లో చిల్లిగవ్వయెత్తు సత్తువ లేదు అనుకో - అంటూ పెద్ద కూతురుకి చెప్పుకుంది తన గోడు.

సౌభాగ్యానికి భోజనా లయ్యాక కాఫీల వేళదాకా వోగంట వ్యవధి వుంటుంది. ఆరోజు వంట్లో శక్తి అంతా గాల్లో కలిసినట్టు వళ్ళు తేలిగ్గా తేలినట్టు అవుతోంది. వోసారి పొయ్యి పైకి తూలి పడకుండా నిలదొక్కుకుంది. నూతిచప్టాపైన జారి పడింది. పొద్దుగూకింది. అందరినీ కనుక్కోవాలి. నన్నెవరూ అడగరే అన్న ప్రశ్న చిన్న నీడలా కదిలి తల్లి అరుపులో మాయమైంది.

కచ్చేరి సావిట్లో గంటలు కొట్టడం వినపడుతోంది. అప్పుడే పది గొట్టారు కాబోలు అనుకుంది. తన గదిలో బొమ్మ ఇంకా మూలుగుతోంది. పొలదాలి చల్లారినా గది ఇంకా వేడిగానే వుంది.

పెద్దింటి తలుపులు చూడలేదని గుర్తుకి వచ్చి అద్దాల దీపం తీసుకు కటకటాల తలుపు తెరిచింది. మండువా పక్క గదిలో మాటలు వినపడుతున్నాయి. కంఠాలు నొక్కుకున్నా

మాటలు ఘర్షణ పడుతున్నట్టు వినపడుతున్నాయి.

ఐతే ఆ నోటు బాకీ నా పేర మార్చనంటారు? ఆ కంఠం పెద్దబావ రామయ్యదే అనుకుంది.

వీధివేపు తండ్రిదగ్గ వినపడి తలుపు దగ్గరగా పెట్టి తన గదిలోకి వెళ్ళబోయి గోడవార నిల్చుంది. ఈ తడవ తల్లికంఠం వణికినట్లు వినపడింది. అందరికన్నా చిన్నది. అతనా అంత నిర్వాకం చేసే తీరువ లేదు. మీరు అంతా పచ్చగా వున్నారాయె. దానికి మీకంటే వో తృణం ముడితే ఏమనుకున్నా నంటోంది.

ఎవరి అదృష్టం ఎవరు చెప్పగలరులే! నువ్వు ఇచ్చే సమంగా ఇస్తే మాలో మాకు కలతలు వుండవు. వోచిటికెడు ఎవరికి ఎక్కువైనా మాలో మాకే విరోధాలు పెట్టిన దానివవుతావు. అని చిన్న అప్ప ధనం పెద్దరికంగా చెప్పతోంది.

ఐనా నాకు అర్థంకాలే సౌభాగ్యాని కివ్వడం ఎందుకు అది ఇక్కడ పడి తినటంలేదూ; రేపు ఎటు వస్తుందో, ఏలుకోకపోయినా వున్నదీ మన్నదీ ఎత్తుకెళ్ళేందుకు వస్తాడేమొ అంటూ పెద్దప్ప రాజమ్మ కోప్పడుతోంది.

తల్లి ఏమంటుందో వినాలని వుంది కాని తల్లి సానుభూతిగా వక్కమాట అనలేదు. సౌభాగ్యం మనస్సులో తిప్పినట్లు అయింది.

గది తలుపు వోరగా పెట్టుకు కుక్కిమంచంపై వాలి పోయింది. మనస్సులో గతం హోరు పెడుతోంది. కెరటాల్లా జ్ఞాపకాలు కళ్ళఎదుట పడుతున్నాయి. లేచి కూర్చుని కిటికి వెనక నందివర్ధనం చెట్టుపై కూర్చున్న గుడ్డివెన్నెలని చూస్తోంది. తన పెళ్ళికి ముందురోజు యిల్లాగే వుంది. మబ్బుల్లో చందమామ మసక దుప్పటి కప్పుకున్నట్టు వున్నాడు. పెత్తల్లి కూతురు పరిహాసమాడుతోంది. మళ్ళీ పున్నమిని చూడనివ్వడులే, కిటికీలు బిగిస్తాడు అంటూ బుగ్గ మెలెట్టడం గుర్తుకి వస్తేనే మనస్సుకి ఆనందంగా వుంది. ఆ రాత్రే తల్లి తనని కఠినంగా అన్న మాటలు గుర్తుకి వచ్చాయి. ఎత్తలేని బరువులు ఎత్తితే మిగిలినవాళ్ళ గతేంకావాలి? పెళ్ళి అవగానే అయిందా ఏమిటి సంబడం! వాళ్ళ హోదాకి తగినట్లు మడుగులు వత్తలేదని దెప్పరూ; అది అటు వుంచి నేనూ నా మిగిలిన పిల్లలం దిగతుడిచిన దివిటీల్లా వాళ్ళముందు నిల్చోవాలా; ఇప్పుడైనా మించిపోయింది లేదు. మేం తూగలేమని కబురు పెట్టెయ్యండి. ఈముహూర్తానికి కామయ్యకిచ్చి ముడెట్టేద్దాం. తాహతుకి మించి పరుగులెట్టకండి అని నాన్నని వేధించటం. అప్పుడు అర్థంకాలేదు. ఇప్పుడుకూడా సౌభాగ్యానికి అర్థం అవదు. తనంటే తల్లికి చిన్నప్పటినించీ గిట్టదేమొ. తనేం తప్పు చేసింది. ఎప్పుడూ ఎదిరించి మాట్లాడటమైనా చేతకాదు. అక్కలూ, చెల్లెలు ఏకమై ఎన్నోసార్లు తగువులు వెయ్యలేదు? ఐనా వాళ్ళంటేనే తల్లికి ఇష్టం అనుకుంది.

ఇంకా పడుకోలేదా అంటూ బామ్మ మూలుగుకి మధ్య పలకరించింది.

పరధ్యానంగా నిద్ర రావటంలేదు అంటూ దీపం ఎగదోసి పెట్టె తెరిచింది. పాతబట్టలకింద పెళ్ళిఫోటో మెరుస్తోంది. పెళ్ళిబట్టల్లో తన రూపాన్ని చూసుకు అపురూప పడింది. అప్పుడే అపశకునంలా పెళ్ళికొడుకుని ఆనుకున్నట్టు మరోవేపు కూర్చున్న అమ్మాయి కళ్ళు తన్ని చూసి హేళన చేస్తున్నట్టు వున్నాయి. అత్తగారిని ఫోటోలో చూస్తోంది. ఏమి అందంరా! ఎర్రతోలు తప్ప అన్న మాటలు వురిమినట్టు మనస్సులో కదిలాయి. మళ్ళీ ఆ అమ్మాయిమీద చూపు నిలిచింది. బొత్తిగా పల్లెటూరిపిల్ల. చీర కట్టుకోవటం కూడా రాదు కాబోలు అంటూ బిగపట్టి నవ్వటం కనపడుతోంది. దుఃఖం మనస్సులో మెరిసింది.

నల్ల మేఘాల్లా రెప్పలు అధిరాయి. ముచ్చెపుచిప్పల్లా నీటిబొట్లు పడి దీపపు వెల్తుర్లో పల్చగా మెరుస్తూ వాలుల్లోకి జారుతున్నాయి. దుఃఖం మనస్సుని కొంచం తేలిక పరచింది.

కళ్ళు బరువెక్కి, నోరు ఎండినట్టు వుంది. దీపం మూలకి జరిపింది. పెట్టె మూసింది. మంచానికి జార్లపడి కూర్చుంది. అసలు పెళ్లి యెందుకు చేసుకున్నట్టు. తనవాళ్ళదే తప్పు అని లెంపలేసుకుంది. పాపం అతనేమి చేస్తాడులే అనుకుంది. మేనమామ కొడుకు పెళ్ళికెళ్ళాలని తల్లి తన నగలు పెట్టుకోవటం గుర్తుకి వచ్చింది.

పడవలో ప్రయాణం జాగ్రత్తసుమా అని బామ్మ తూరీగలా హోరెట్టినట్టు చెప్పడం, అమ్మ విసుక్కోవడం, పెద్దబావ, పెద్దక్క తల్లిని తీసుకువెళ్ళటం కనపడుతున్నట్టు తోచింది. ఎప్పటివో ఎందుకు వచ్చిన జ్ఞాపకాలు అని విసుక్కుంది. నిద్రపడితే బాగుండును. మళ్లీ తెల్లారితే బోలెడు చాకిరీ ఎవరూ మెచ్చుకపోయినా తను చెయ్యాల్సిందేగా. వద్దన్నా పెళ్ళికి వెళ్ళిన తల్లి తిరిగిరావడం మనస్సుని వదలటం లేదు. బామ్మ వాకిట్లోనే ఆరాతీసి శోకాలు పెట్టడం, ఇరుగూ పొరుగు పరామర్శలు, తల్లి మాట్లాడకుండా వూరుకోవడం, మొదట వోదార్చి గుసగుసలాడుతున్నారా? అని ధనమ్మ తగూ పెట్టుకొని వెళ్లిపోవటం గుర్తుకి వచ్చాయి. మర్చిపోవాలనుకుని పెరటి తలుపు తెరచి ఆవుదూడకి గడ్డివేసి వచ్చింది.

ఎవరో అక్కడ అంటూ రత్తమ్మ పలకరించింది. నిద్దరట్టలేదు అంటూ వళ్ళు విరుచుకుంటూ దడి దగ్గరకెళ్ళింది సౌభాగ్యం.

విన్నావా మీ అమ్మమాటలు మద్దేన్నం అంటూ అటుపక్క దడి దగ్గరికి చేరింది రత్తమ్మ. అసలు ఆదిలో మీ అమ్మే పెద్దల్లుడికి ఇచ్చేసి పోయినట్టు నాటకం కట్టిందట. పిల్లమీద మోజువుండి చేసుకున్నారుకదా? ఈ నగలకోసం వదుల్తారా అన్న ధీమాతో చేయించిందే, నీకు ఇంత సత్తెకాలం బుద్ధి పెట్టాడు భగవంతుడు. ఏం లాభం అనుభవించేందుకు ఇవ్వలేదు. అది సరేకాని మీ పెద్దబావ ఎవరిదో డబ్బు మాయం చేసి తెచ్చి మీ అమ్మచేతికిస్తే ఇవ్వనంటోందటగా; నిజమేనా నీ మొహం నీకేం తెలుస్తుందిలే! అంత తెలిస్తే కాపరానికి నీళ్ళు ఎందుకు వదులుకుంటావు!

ఎవరో వస్తున్న అలికిడికి రత్తమ్మ దూరంగా జరిగింది. సౌభాగ్యం పెరటి మెట్టుపైన కూర్చుంది. ఇంకా పొలాల్లో చీకటి నిద్దరోతోంది. ఆకాశం కళ్ళు తెరిచినట్టు వెల్తురు మసగ్గా దిగుతోంది.

మళ్ళీ ఆలోచనలు తేనెపట్టులా రేగాయి. దొంగలు ఎత్తుకెళ్ళిన కాసులదండ మళ్ళీ ఎల్లా వచ్చిందీ. బావడబ్బు తల్లి ఇవ్వకపోతే పెద్దప్ప వూరుకుంటుందా? అమ్మ పీకనులుమును. సంగతి తెలవదేమోనని సమాధాన పడింది.

తండ్రి తీసుకెళ్లిన్నాడు కూడా ఇదే వేళ అత్తగారు తలుపు తియ్యటం, తండ్రి ఉత్తరంతో తెలిపానని నసగటం, కాళీదేవిలా ఆవిడ అరచి అలసిపోయి, గడప తొక్కవద్దనటం, చిరుచీకటిలో కిటికీవూచల వెనక అతనికళ్లు జాలిగాచూడటం, అత్తగారి ఆకారం కిటికీ దగ్గరకి వచ్చి పెద్దగా పెరిగి తలుపులు మూయించటం గుర్తుకివచ్చి, ఆరిపోయిన కళ్లు చమర్చాయి. తండ్రి పోలికంటారు. ఆ ఇంట్లో ఆయనకేం మన్ననలు జరుగుతున్నాయి. తనకి లేవనుకునేందుకు అని సమాధాన పడింది.

భాగ్యం అంటూ తండ్రి గట్టిగా కేకపెట్టాడు. పెరట్లోంచి ముందు ఇంట్లో అడుగుపెట్టింది. అతను వచ్చాడు అంటూ మాటలు రాక తడువుకుంటున్నాడు. వచ్చీరాని వెల్తుర్లో చేతిలాంతరు వెలవెల్లాడుతోంది.

సౌభాగ్యానికి మాట రాలేదు. దీపం అట్టేపెట్టి పెరట్లోకి వెళ్ళింది. గదితలుపులు తెరచి కాసులదండ బట్టవెనక పెట్టుకు వచ్చింది. అతని ముందుకి జరిపి తేలిగ్గా వూపిరితీసింది. అమ్మ నిన్ను చూడాలంటోంది ఆఖరిసారి. మాట గతానికి మాసిగవేసినట్టు వుంది.

సౌభాగ్యానికి క్షణంసేపు కాలం నిల్చినట్టు అయింది.

తల్లి, అప్పలూ గతాన్ని తవ్వుకున్నారు. సౌడిభ్యం ఇపుడా ఏమిటి! ఏలుకునే ముచ్చట; అంటూ ధనమ్మ ఈసడించింది. అప్పుడు డబ్బుచూసుకు మిడిసి పడ్డారు. ఇప్పుడు చేసే దిక్కులేక పంపి వుంటుందే - అంటూ రాజమ్మ తల్లి వెనకనిల్చింది.

సౌభాగ్యం అగాధంలాంటి జీవితం అనుభవించకుండానే వడ్డుకి చేరింది. అతను వేసిన మాసికని చింపటానికి మనస్సు వప్పలేదు. గుడ్డివెల్తుర్లో నిర్మలంగా వున్న తండ్రికేసి చూసింది. దూరంగా వున్న వేణుగోపాలస్వామి ఆలయశిఖరం చూసింది. పెరట్లోని తులసికోట శిఖరాలని చూసింది. సూర్యోదయానికి తెరచిన ద్వారంలాంటి తూర్పు దిక్కుకితిరిగి అతని వెనక నడిచింది.

తల్లి అరుపులు, అక్కల హేళనా, రోడ్డుమలుపు తిరిగే దాక సాగనంపాయి. ప్రశాంతమైన గౌతమీనది పాయలో నీళ్ళు, నిశ్చింతగా నిద్దరోతున్నట్టు ఆటుపోటులేకుండా కదులు తున్నాయి. రావిచెట్టు ఆశీర్వదించింది. ఆకులు సౌభాగ్యం నెత్తిన పడ్డాయి.

అతని ఆప్యాయత గతాన్ని కప్పి కాలాన్ని వెనక్కి జరిపినట్టువుంది. సౌభాగ్యం జీవితం నిచ్చెనెక్కింది.

✧

సి. పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం
క డ ప, వరుస సంఖ్య E15735
తేది